# భక్తియోగం - రాజయోగం- జ్ఞానయోగం

పి. శివరామకృష్ణ (శక్తి)

ఈ మధ్యన ఒంగోలులో జరిగిన కోస్తాప్రాంత వివేకానంద జయంతి ఉత్సవసమితి కార్యకర్తల సమావేశంలో మత్స్యకార - వనవాసీ ఆయామం ఉపసమావేశంలో, మత్స్యకారులలో పనిచేస్తున్న శ్రీజయరామయ్య పరిచయమైనారు. గిరిజనులకు ఆటవీహక్కుల గుర్తింపుచట్టం అమలు జరుగుతుంది- త్వరలో ఇదేవిధంగా తీరప్రాంత మత్స్యకారులకుకూడా హక్కుల గుర్తింపుచట్టం రానున్నది అని నేను చెప్పాను. ఈ చట్టాల గురించి భీమవరంలో జరగనున్న మత్స్యకార సంక్షేమసమితి సమావేశంలో వివరించండి అని ఆయన నన్ను ఆహ్వానించారు.

భీమవరంలో సమావేశం ప్రారంభించిన స్వామీజీ తమ ఆశ్రమంలో అరుంధతీ వశిష్ఠుల కళ్యాణం జరిపిస్తున్నాము అంటూ ఆహ్వానించారు. వశిష్ఠుని కొడుకు శక్తి, ఆయన కొడుకు పరాశరుడు ఆయన మత్స్యగంధిని పెళ్ళాడాడు అని పురాణకథ గుర్తుచేశారు. మత్స్యనారాయణ జయంతి జరుపుతున్నందువల్ల తమ కుటుంబ పరిస్థితులు చక్కబడ్డాయని, కొందరు క్రైస్తవుల ప్రచారాలను నిరోధించామని కార్యకర్తలు చెప్పుకొచ్చారు. తర్వాత సంఘం ఎన్నికలు. వారి సలహాదారు, వృత్తిరీత్యా న్యాయవాది అయిన ప్రాంతకార్యవాహ శ్రీరవి నిర్వహించి, ఈ మధ్య జరిగిన హిందూసంగమం ప్రభావం గూర్చి ముచ్చటించారు.

భోజనానంతరం నావంతు వచ్చింది. నాకుతోచిన సలహాలు, సందేహాలు ప్రస్తావిస్తూ మత్స్యావతారం సరే, కూర్మావతారంకూడా మీదే కదా- ప్రభుత్వం నక్షత్ర తాబేళ్ళు రక్షించడానికి వందలకోట్లు ఖర్చుపెడుతుంది - మీరుకూడా కూర్మజయంతిద్వారా పర్యావరణ పరిరక్షణ ఉద్యమం ఆ జయంతి ద్వారా చేపడితే బాగుంటుందని సలహా ఇస్తూ, అరుంధతి కన్యాదానం ఎవరు చేయాలి అని ప్రశ్నించాను. అరుంధతీయులు అంటే ఆదిఆంధ్రులు చేయాలి అని అందరూ బదులిచ్చారు. మీరు మత్స్యకూర్మ జయంతులు జరుపుకోవడం మాత్రమే కాదు- మిమ్మల్ని చూసి ఇతర సామాజికవర్గాల వారు కూడా వారసత్వంగా మన సంప్రదాయంలో వారి వారి పాత్రలను నిర్వహించడానికి పూనుకోవాలి. నిర్వాహకులు వారికి ఆ అవకాశం కల్పించాలి. తిరుమల క్షేత్రంలో వరాహస్వామి అనుమతితోనే అన్ని సేవలు వేంకటేశ్వరునికి ప్రారంభమవుతాయి. వరాహ జయంతిని పందులను పెంచే వృత్తులవారు, ఎరుకలతెగ జరుపుకొనే విధంగా ప్రోత్సహించాలి. యాదవులు కృష్ణాష్టమి వేడుకలలో ప్రముఖపాత్ర వహిస్తారు కాని అనుసూచిత, జాతులు, తెగలలోమాత్రం ఈ వారసత్వాన్నీ పునరుద్ధరించడంలో మనం వెనకబడి పోతున్నాము. మాల దాసరుల కులదైవం చెన్నకేశవస్వామి. ప్రకాశంజిల్లా మార్కాపురంలో ప్రసిద్ధమైన చెన్నకేశవ దేవాలయం ఉంది. కాని మాలదాసర్లు ఆదేవాలయంతో సంబంధం లేకుండా వేరే దేవాలయం కట్టుకున్నారు. ఈ రెండు వర్గాల మధ్య ఇచ్చిపుచ్చుకోవడం ప్రారంభించాలి. వివేకానంద 150 జయంతి ఉత్సవాలసందర్భంగా చెంచులక్ష్మికళ్యాణం జరుపుతున్నారు. కాని ఉరవకొండ క్షేత్రంలో చెంచులక్ష్మి కళ్యాణం జోగిని వ్యవస్థ కొనసాగింపుగా జరుపుతున్నారు. క్రమంగా ఆ దురాచారం మార్పించే పరిస్థితులు వస్తాయనుకుందాం.

తి.తి.దే వారు మాతృశ్రీగా వర్ణించే తరిగొండ వెంగమాంబ మొదలైన వారు వెంకటేశ్వరుని నరసింహావతారంగా భావించి చెంచులక్ష్మిని పెళ్ళాడిన కథను చెంచునాటకంగా వ్రాశారు. నల్లమలలో చెంచుతెగ సోదరులే చిత్తూరు, నెల్లూరుజిల్లాలలో యానాదులు. వారి ఇష్టదైవం వెంకటేశ్వరస్వామి. లంబాడీ తెగకు చెందిన హథీరాంబాబాతో శ్రీనివాసుడు పాచికలు ఆడేవాడట.



క్షీరాబ్ధిద్వాదశినాడు మాలదాసరి తన మంగళ కైశికీగానాన్ని బ్రహ్మరాక్షసికి ధారపోసిన సందర్భంగా ఉత్సవం నిర్వహిస్తారు.

క్రమంగా ఈ దేశి సంప్రదాయాలు కనుమరుగు అవుతున్నాయి. ఈ ఉత్సవాలలో ఆయా జాతులవారు ఎక్కువ సంఖ్యలో పాల్గొనే విధంగా ప్రయత్నంచేయాలి. లేకపోతే ఆ జాతులు, తెగలు మనకు మరింత దూరమవుతాయి.

ఒకోచోట స్థానిక సంప్రదాయాలు ప్రత్యేకంగా ఉంటాయి. వాటిని తెలుసుకొని గౌరవించాలి. ప్రచారం చేయాలి. విశాఖజిల్లాలో తి.తి.దే. కార్యక్రమాలు నిర్వహించే భాగవతుల ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు డా.పరమేశ్వరరావుగారు ఆజిల్లా మన్యంలో తి.తి.దే. కార్యక్రమాలు నిర్వహించడంలో నా సహకారం కోరారు. ఆ మన్యం మత్స్యదేశం. గిరిజనులు తమను పాండవులుగా భావిస్తూ 'జోర జోర జోర- పంచపాండవులారా' అని కొలుపులు చేసుకుంటారు. దిగువ ఎగువ ప్రాంతాల మధ్య - కులాల మధ్య సమైక్యత కోరుతూ మోదకొండమ్మపదం పాడుతారు. నరికె, తుడుము, సన్నాయి వంటి మంగళవాద్యాలతో పండుగలు చేసుకుంటారు. వీటి ప్రచారం

చేపడితే బాగుంటుంది. అని చెప్పాను. నా అభిప్రాయాన్ని ఆ ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారి ద్వారా దేవస్థానానికి తెలియజేస్తామన్నారు- తరువాత పరమేశ్వరరావుగారినుండి సమాధానం రాలేదు.

✣ ✣ ✣

తీరప్రాంతంలో సాంకేతికంగా, చట్టపరంగా వస్తున్న మార్పుల గూర్చి 2009లో పత్రికలో వచ్చిన వార్తలు వారిముందుంచాను. ఈ వార్తలు తమ దృష్టికి రాలేదని కొంతమంది. చూచాయగా తెలిసినా పట్టించుకోలేదు అంటూ కొందరు బదులిచ్చారు. ఈచట్టాలు, రూల్స్ ఎవరు పాటిస్తున్నారు? అన్ని విధాల మాకు అన్యాయమే జరుగుతుంది అంటూ కొందరు నిరాశను, అసహనాన్ని వ్యక్తంచేశారు. ఒకనాడు మత్స్యజయంతి అని కాలెండర్‌లో చూసేవారం. కాని పట్టించుకోనేవారం కాదు అన్నారు. గత పదేళ్లుగా సంఘంగా ఏర్పడి తిరుపతి దేవస్థానం సహకారంతో ఇప్పుడు జయంతి ఉత్సవాలు చేసుకుంటున్నారు కదా! పార్టీనాయకులలాగా కేవలం చట్టాలు వల్లించిన మాత్రాన అధికారులు స్పందించరు. ఆ చట్టం ప్రకారం తాము ఇచ్చిన ఉత్తర్వులు ఎక్కడ అమలు జరపడం లేదో స్పష్టంగా కచ్చితంగా తెలిస్తేతప్ప అధికారులను నిలదీయలేం బ్రిటీష్‌వాళ్ళు గ్రామపటాలు తయారుచేసి - ఆయా భూములకు సర్వేనెంబర్లు ఇచ్చారు. ఈవిధానం ప్రవేశపెట్టి ఇప్పటికి వందేళ్ళు దాటింది. కాని ఊళ్ళో, ఆ దిబ్బ, ఈ లంక, చెలక అంటూ కొండగుర్తులు తప్ప, రైతులు ఆయా గుర్తుగల ప్రాంతాల సర్వేనెంబర్లు చెప్పలేరు. మన పాఠశాలలో కూడా ఈ చదువు చెప్పరు. అందువల్ల అటు అధికారులు - ఇటు తెలివిగలవాళ్ళు - మిగిలినవాళ్ళను మోసం చేస్తున్నారు.

ఇక సముద్రంలో సర్వేనెంబర్లకు బదులు జిపిఎస్ రీడింగ్‌లో ఆయా ప్రదేశాలను గుర్తిస్తారు. ఇప్పటికీ కొద్దిమంది మత్స్యకారులు అక్కడక్కడ జిపిఎస్ కొనుక్కుంటున్నారు. కాని వారికి దిక్కులు చూడడం తప్ప- మత్స్యశాఖ వారు చేపలుపడే చోట్లను తెలిపే అక్షాంశ, రేఖాంశాలను గుర్తించే నైపుణ్యం లేదు. పెద్దమరపడవలు నడిపేవారు ఈ నైపుణ్యం పెంచుకొని, మీకు కేటాయించిన ప్రాంతంలోకి చొరబడి చేపలు పట్టుకుంటున్నారు. భీమునిపట్నం పక్కన ఒక గ్రామంలో మత్స్యకారులు సెల్‌ఫోన్‌తో చొరబాటుదారుల ఫోటోలు తీసి జరిమానా కట్టిస్తున్నారు.

భూమి అడవి హక్కులలో మాచే శిక్షణ ఇప్పించినట్లే - రానున్న తీరప్రాంతమత్స్యకారుల హక్కులచట్టం అమలుకు కావలసిన ఏర్పాటు తయారీలో ప్రభుత్వం మా సాయం కోరింది. ఈ పని పూర్తిచేయడానికి చాలా ప్రాంతాలు తిరుగుతున్నాం.

మన పరివారక్షేత్రాలలో ఐటి నిపుణులున్నారు- ఊరూరా ఇంజినీరింగ్ కాలేజిలున్నాయి. న్యాయవాదులున్నారు. సాంకేతిక నైపుణ్యం పెంపుదల కోసం, చట్టాలు అమలుకోసం, శిక్షణా సదస్సులు నడపమని అడగండి- మారుతున్న కాలానికి తగిన నైపుణ్యాన్ని పెంచుకోవడం మత్స్యకార, తీరప్రాంతాల సంక్షేమం కోసం చేసిన చట్టాల అమలుకు కావలసిన ఉత్తర్వులు, ఏర్పాట్లు, సేకరించి అర్థం చేసుకొని-తప్పులను వేలెత్తి చూపడం, అమలుకు ఒత్తిడి చేయడం రాజయోగం. మత్స్యనారాయణజయంతి ద్వారా భక్తియోగంతో ప్రారంభమై, రాజయోగం ద్వారా సంక్షేమరంగంలో బలపడి, జ్ఞానయోగం ద్వారా ఇతరవర్గాలను ప్రభావితం చేసి, కర్మయోగంద్వారా అభివృద్ధిని సాధించటంలో మనం వేగం పుంజుకోవాలంటూ నేను ప్రారంభించిన చర్చను ముగించాను.

సముత్కర్ష నిశ్శ్రేయ సస్యైక ముగ్రం
పరమ్ సాధనన్ నామ వీరవ్రతమ్

●